


విశ్వామిత్రుని దగ్గర గాలవుడనే శిష్యుడుండేవాడు.

అతను ఒక మునికుమారుడు. తన విద్యాభ్యాసం పూర్తికాగానే గురువుగారికి ఏదైనా కట్నం ఇద్దామనుకున్నాడు.

అనుకున్న ప్రకారం చదువు పూర్తికాగానే గురుదక్షిణ కోరమని విశ్వామిత్రుని నిర్బంధించాడు. తనకేమీ అక్కర్లేదని గురువు చెప్పినా గాలవుడు వినాడు కాదు. శిష్యుడి మొండి పట్టుదలకు గురువుగారికి కోపం వచ్చి ఒక్క చెవి మాత్రం నీలంగా వుండి మిగతా శరీరమంతా తెల్లగా వుండే ఎనిమిది వందల గుర్రాలు తెచ్చి ఇమ్మన్నాడు. గాలవుడు వాటికోసం పగలూ రాత్రీ నిద్రాహారాలు మాని వెదికాడు. ఎక్కడా దొరకలేదు. చేసేది లేక తన చిన్ననాటి స్నేహితుడైన గరుత్మంతుడి దగ్గరకు వెళ్ళి ప్రాధేయపడ్డాడు. గరుత్మంతుడు గాలవుడికి ధైర్యం చెప్పి అతడ్ని తన వీపు మీద ఎక్కించుకుని ప్రతిష్ఠాన పురాధీశ్వరుడు యయాతి దగ్గరకు తీసుకువెళ్ళాడు. యయాతీ, గరుత్మంతుడూ మంచి స్నేహితులు.

సంగతంతా విన్నాక ఒక్క కర్ణం నీలంగా వుండి మిగిలిన శరీరమంతా శుద్ధ ధవళ వర్ణంలో వుండే గుర్రాల కోసం అశ్వశాలంతా వెదికించాడు యయాతి. అటువంటిది ఒక్కటి కూడా దొరకలేదు. "మిత్రమా! నా దగ్గిర మీరు కోరిన గుర్రాలు లేవు. ఇదిగో ఈ అమ్మాయి మాధవి నా కూతురు. ఈ కన్యను ఏ రాజుకైనా ఇచ్చి మీకు కావల్సిన గుర్రాల్ని తెచ్చుకోండి" అని కూతుర్ని వాళ్ళకు ఇచ్చాడు. మాధవి తండ్రి కళ్ళల్లోకి తీక్షణంగా చూసి గ్రుడ్ల నీళ్ళు గ్రుడ్ల కుక్కుకుని చేసేదిలేక గాలవుడ్నీ, గరుత్మంతుడ్నీ అనుసరించింది. ఆ అమ్మాయిని తీసుకుని వాళ్ళిద్దరూ ఇక్ష్వాకు మహారాజు దగ్గరకు వెళ్ళారు. మాధవిని తీసుకుని తమకు కావల్సిన ఎనిమిది వందల గుర్రాల్నీ ఇమ్మన్నారు. తన దగ్గర అలాంటి గుర్రాలు రెండు వందలు మాత్రమే వున్నాయన్నాడు ఇక్ష్వాకు మహారాజు.

గాలవుడూ, గరుత్మంతుడూ సందేహంలో పడ్డారు. రెండు వందల గుర్రాల కోసం బంగారు బొమ్మ లాంటి మాధవిని వదులుకోడానికి గాలవుడు ఇష్టపడలేదు.

"నాకు పిల్లలు పుట్టినా కన్యగానే వుండేటట్టు ఒక మహర్షి నాకు వరమిచ్చాడు. కనుక ఏదైనా షరతు పెట్టుకుని నన్ను ఈ రాజుకు సమర్పించు. ఎందుకైనా మంచిది ముందు ఈ రెండు వందల గుర్రాలూ పట్టుకెళ్ళు" అని సలహా ఇచ్చింది మాధవి.

ఇక్ష్వాకు మహారాజుకు మాధవి మీద మనసైంది. ఆమె ద్వారా పుత్రుడ్ని కనాలనుకుని "ఒక కుమారుడు కలిగే వరకూ ఈమెను భార్యగా స్వీకరించి ఆ తరువాత మళ్ళీ మీకు అప్పగిస్తాను" అన్నాడు ఆయన. సరేనని రెండు వందల గుర్రాలూ తీసుకున్నాడు గాలవుడు.

ఇక్ష్వాకు మహారాజుకు మాధవి వలన ఒక కుమారుడు కలిగాడు. అతని పేరు వసుమనస్సుడు. ఇచ్చిన మాట మేరకు గడువు ముగిసిన తరువాత ఇక్ష్వాకు రాజు మాధవిని గాలవుడికి ఇచ్చాడు. తరువాత కాశీ రాజైన సుదేవుని పుత్రుడు దివోదాసుని దగ్గరకు వెళ్ళి ఒక్క చెవి నీలంగా వుండి మిగిలిన శరీరమంతా తెల్లగా వుండే ఆరు వందల గుర్రాలు ఇమ్మని అర్థించాడు గాలవుడు. దివోదాసుడు తన దగ్గర అటువంటివి రెండు వందల గుర్రాలే వున్నాయని చెప్పి వాటిని గాలవుడికి ఇచ్చి అందుకు ప్రతిగా యయాతి పుత్రిక మాధవిని తీసుకున్నాడు. దివోదాసుడికీ మాధవికీ ప్రసర్దనుడనే పిల్లవాడు కలిగాడు. కొంతకాలం తరువాత దివోదాసుడు మాధవిని గాలవుడికి ఇచ్చాడు. గాలవుడు ఆమెను తీసుకుని ఉశీనర దేశాన్ని పాలించే ఉశీనరుడి దగ్గరకు పోయి అతనికి మాధవిని ఇచ్చి మరో రెండు వందల గుర్రాలు పుచ్చుకున్నాడు. ఉశీనరుడికీ, మాధవికీ జన్మించిన వాడే శిబి చక్రవర్తి. గడువు కాలం ముగియగానే ఉశీనరుడు మాధవిని గాలవుడికిచ్చేశాడు. అలా మాధవిని పణంగా పెట్టి గాలవుడు ఆరువందల గుర్రాలు సంపాదించాడు. మిగిలిన రెండు వందల గుర్రాలకోసం గాలిస్తుంటే గరుత్మంతుడు వచ్చి "ఇలాంటి గుర్రాలు మొత్తంగా ఇంకెవరి దగ్గరా దొరకవు. సంపాదించిన ఆరు వందల గుర్రాలూ తీసుకెళ్ళి మీ గురువు గారికి ఇచ్చి మిగతా రెండు వందల గుర్రాలకు బదులు మాధవిని స్వీకరించమని ప్రార్థించు" అని సలహా ఇచ్చాడు. గాలవుడు వైనతేయుడి సలహా పాటించి విశ్వామిత్రుడి పాదాల మీద పడ్డాడు. ఆయన ఆరు వందల గుర్రాల్నీ, యయాతి కుమార్తె మాధవినీ స్వీకరించాడు మాధవి వల్ల ఒక కుమారుడు కలిగేంత వరకూ ఆమెను తన వద్ద అట్టే పెట్టుకునేందుకు ఆయన అంగీకరించాడు. విశ్వామిత్రుడికీ, మాధవికీ జన్మించిన పిల్లవాడి పేరు అష్టకుడు.

అష్టకుడు పుట్టాక, మాధవి మీద మోజు తీరా! గడువు ముగిసిందన్న నెపంతో మాధవిని విశ్వామిత్రుడు గాలవుడికిచ్చేశాడు.

గాలవుడు మాధవిని తీసుకు వెళ్ళి యయాతికి అప్పగించాడు.

మాధవికి తండ్రిని చూసిన ఆనందం గానీ పుట్టింటికి వచ్చానన్న సంబరం కాని, చెలికత్తెలతో ఊసులాడాలన్న ధ్యాసగాని కలగలేదు.

'తనొక మరబొమ్మ. తన వయస్సునీ, అందాన్నీ పిల్లలు కలిగినా కన్యాత్వానికి అపభ్రంశ రానివ్వదని తనకున్న వరాన్నీ అడ్డం పెట్టుకుని ఇన్నాళ్ళూ అందరూ తమ అవసరాలు తీర్చుకున్నారు. మహర్షి ఇచ్చిన వరం తనకు శాపమైంది!' మౌనంగా లోపలికి నడిచింది మాధవి.

రోజులు గడుస్తున్నాయి. కూతురికి వివాహం చేయదల్చుకుని యయాతి స్వయంవరం ప్రకటించాడు. సౌందర్యఖని మాధవి స్వయంవర మహోత్సవానికి ఎందరెందరో రాజులు వచ్చారు.

అపురూప శిల్పంలా స్వయంవర మందిరంలో నిలచింది మాధవి.

శిరస్సు ఎత్తి అందరినీ ఒకే ఒక్కసారి నిశితంగా చూసింది.

అంతే-తన చేతిలోని వరమాలను తన మెడలో వేసుకుని అడుగు కదిపింది.

కాలి నడకన కానలకు వెళ్ళిన సాహసి మాధవి శేష జీవితమంతా అడవుల్లో తపస్సు చేసుకుంటూ గడిపింది.

ఆడపిల్ల వయస్సునీ అందాన్నీ పణంగా పెట్టి తమ పనులు నెరవేర్చుకునే పురుషోత్తములు పుట్టిన పుణ్యభూమిలో వెర్రితలలు వేసిన పురుషాధిక్య సమాజాన్ని వేదకాలం నాడే నిరసించిన సుధీర మాధవి.

